# కొత్త చైర్మన్ చెత్తబుట్ట



"హితశ్రీ"

కొత్తగా ఎన్నుకోబడ్డ చైర్మన్ గారికి వారి పరిచితులూ, అపరిచితులూ తమ శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన కొన్ని ఉత్తరాల్లో, చదివి ఆనందించ తగ్గ కొన్ని ముఖ్యభాగాలు ఉదహరిస్తున్నాను. ఈ ఉత్తరాల మీది సర్వస్వామ్యాలూ చైర్మన్ గారి చెత్తబుట్టవే. సదరు ఉత్తరాల సృష్టికర్తల పేర్లు ప్రకటించటానికి అనుమతి నిరాకరించబడ్డది.

ఒక ఆప్తమిత్రుడు:

"...నువ్వు చైర్మన్ అయినావని విని నేను చైర్మన్ అయినట్టుగానే ఆనందిస్తున్నాను. మనిద్దరి అన్నలాగా ఒక్కరికే ఆ యోగ్యత? మనలో ఎవరు చైర్మన్ అయితేనేం? మనం ఒకరిమాట ఒకరం ఎప్పుడు కాదన్నాం గనక? పదవులు స్నేహాన్ని విచ్ఛిన్నం చేయలేవని నువ్వు రుజువు చేస్తావని నాకు పరిపూర్ణ విశ్వాసం ఉంది. నువ్వు అడగకుండానే సమర్థనతో పదవి నిర్వహించడానికి నాకు తోచిన సలహాలు ఇస్తూ ఉండగలను..."

ఒక దూరపు చుట్టం:

"...మా వాడు చైర్మన్ అని చెప్పుకోటానికి నాకు చాలా సంతోషంగా ఉంది. నువ్వు మనవాళ్ళ పేరు నిలబెట్టావు. నేనిప్పుడు తలెత్తుకు గర్వంగా తిరగ్గలుగుతున్నాను. మొన్నేమయిందనుకున్నావ్? మా రెండోవాడు సైకి లేకుండా మా బస్తీకొచ్చాడు కొత్త పని ఉండి. వాడికి బస్తీరోడ్డు రూల్సు సరిగ్గా తెలీవు— ఇంకా స్వచ్ఛవిధంగా— కుడివేపునించి సైకిల్ పోనిచ్చాట్ట- స్టాండు మీదున్న పోలీసు దబాయించాట్ట. కాస్త తెలివిగల ఘటం గనక, 'నేను చైర్మన్ గారి ఫలానా ఫలానా' అని గనుక చెప్పకు లేకుంటా ఆ కేసులికి కనిస్టేబుల్ తీసుకుపోయేవాట్ట. ఎవడికోసం! అయినా వాడికో నాల్గింటిస్తే..."

ఒక సుపరిచితుడు:

"అధినాయకులు- పాత చైర్మన్ గారికి నే నంటే పడదు. ఆ రోజుల మా ఇంటి ఎదురుగా ఓ చెత్త కుప్ప వేయించారు. దానికి పరఖాస్తు పెట్టుకునే చేసిని నేను ఇన్నాళ్ళూ సహించాను. సదరు దబ్బాకు ఎదురుగా స్థానభ్రష్టత్వం కలిగిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. మరో మనవి. మా ఇంటికి రెండిళ్ళవతల ఉన్న వ... మీకు వ్యతిరేకంగా వోటు వేశాడు. ఈ దబ్బా ఆయన ఇంటిముందు ప్రతిష్ఠించ గలిగితే గాక. వీలైతే ఇలాంటి మరో డబ్బా కూడా అక్కడికి తరలించడం మంచిది..."

సన్నిహిత పరిచయం ఉన్న ఓ వర్తకుడు:

"అయ్యా, మీరు చైర్మన్ కావటం మా అదృష్టం. తమరి పిల్లలెప్పుడూ మా కొట్లోనే కావలసినవన్నీ కొంటూ ఉంటారు. దయయుంచి మీ ఆఫీసు సిబ్బంది గూడ వచ్చి వాళ్ళ కవసరమైన వస్తువులన్నీ నా దగ్గరే కొనవలసిందిగా సిఫారసు చేయగలందులకు మనవి. ఈ మధ్య నేను స్టేషనరీ సామాన్లు కూడా తెప్పిస్తున్నాను. ఒక సంవత్సరందాకా తమ ఆఫీసుకు కావలసిన

ఖాళీలు వచ్చినా వ్రాత పరీక్షలకి వెంటనే ఆర్డరు ఇప్పించగలందులకు తమ ఘనమును మిక్కిలిగా ప్రార్థిస్తున్నాను. మన అబ్బాయిలకు కావలసిన ఎక్సర్‌సైజు పుస్తకాలు ఇప్పుడే తమ ఇంటికి పంపించాను..."

ఒక అంతరంగికుడు:

"...చాలా సంతోషం - చూడూ, మన సుబ్బారావుగారి మూడోవాడు స్కూల్ ఫైనల్ పూర్తిచేశాడు. మన ఆఫీసులో వేసుకుంటే బావుంటదూ? మనకి కావలసినవాడు. ఖాళీలు లేవంటావేమో? ఈమధ్య ఓ ఇంటర్మీడియేట్ ప్యాసయినవాణ్ణి కొత్తగా వేసుకున్నారుటగా? ఇంటర్ ప్యాసయినవాడికి కెక్కడో ఉద్యోగం దొరక్కపోతుందీ? ఏమంటావ్? అన్నట్టు... అప్పర్ డివిజన్ క్లర్క్‌గా ప్రమోషనయేట్టు చూడు, పాపం-పిచ్చవాడు, నన్ను ఆశ్రయించుకుని తిరిగేవాడు..."

ఒక ఫర్నిచర్ వర్క్స్ ప్రొప్రయిటరు:

"...లోగడ తమరు ఆర్డరు వేయించినప్పుడు చెక్క సామగ్రి యావత్తు నేనే సప్లయిచేసి యున్నాను. ప్రస్తుతము తమరు కౌన్సిలులో కూర్చోటానికి చక్కటి రోజ్‌వుడ్ చెయిర్ ఒకటి ఆర్డరిప్పిస్తారని ఆశపెట్టుకుని యున్నాను. మన మునిసిపల్ హైస్కూల్‌కి ఫర్నిచర్ అవసరమని తెలుస్తూ యున్నది. తమరు 'ఊఁ' అంటే టెండరు పెట్టుకోగలనాడను. తమ దయ..."

ఒక శ్రేయోభిలాషి:

"...చైర్మన్‌గా ఎన్నుకోబడ్డప్పటినుంచీ తమరి పూజరియే విందుల సంఖ్య హెచ్చుగా ఉంటున్నది. నాచే కనిపెట్టబడిన 'వాతాపి జీర్ణం' మాత్రలు ఎట్టి విధమైన అజీర్ణవ్యాధినైననూ పారదోర్చగలవు. ఒక్కసారి వాడి చూచిన మీకే తెలియగలదు. తమవంటి ప్రముఖులు వాడిచూచి సర్టిఫికెట్టు దయచేసిన నా మాత్రలకు బహుళ ప్రచారముకలిగి లోకమునకు గొప్పమేలు జరుగును."

ఒక దగ్గరి బంధువు:

"...మన పడమటి పొలం ఎన్నాళ్ళకీ అమ్ముడు పోకుండా ఉంది. మునిసిపాలిటీ పట్టణ విస్తరణ పథకాలు తయారుచేసి స్థలాలను కొనేట్టు చూడకూడదూ? పట్టణం పడమటివైపు అభివృద్ధి చెందటం మంచిదని నీ పలుకుబడి వినియోగించి అధికారులకి నచ్చచెప్పలేవూ? ప్రయత్నించు. ఈలోపల ప్లాట్లువేసి ఉంచుతాను, బొత్తిగా ధర రాకుండా ఉంది. చివరికెలాగైనా. కనీసం పుకార్లైనా పడితే మంచి ధర రావొచ్చు. ఈ ఛాన్సు పోతే ఇహ మన పొలాలు అమ్ముడు పోవటమే కష్టం. నా పొలాలకి అనుకునేగా నీ పొలాలు కూడా ఉన్నాయి. నాదేమిటి పెద్దవాడినైపోయాను...నీ విషయమే..."

ఒక ఓటరు మహాశయుడు:

"...మీరు కౌన్సిలర్‌గా ఒక్క ఓటు మెజారిటీతో ఎన్నికయ్యారు. ఆ ఒక్క ఓటూ నాదే నని మనవి చేస్తున్నాను. చివరిదాకా తటపటాయించి మీమీద నాకు ఉన్నటువంటి అభిమానం వల్ల చివరికి తెగించి మీ పెట్టెలోనే నా ఓటు వడేశాను. నేను కోరిన కించిత్తుసేవనీ మీరు మన్నిస్తారని తలుస్తాను. సెలవు చూసుకుని తమ దర్శనం చేసుకుంటాను..."

ఒక స్నేహితుడు:

"...అప్పుడుగాని మా ఇంటికి అంత పన్నేమిటయ్యా? ఏదీ-నీ పలుకుబడి ఎంత గొప్పదో చూద్దాం—పన్ను ఎంతవరకు తగ్గించగలవో తగ్గించుమరి!...నీకు తెలుసుగా? మా వీధి చివర ఉన్నాడే సాహుకారు- ఆయన కమీషనర్‌కి ఇష్టుడని నా అభిప్రాయం- లేకపోతే అంత పెద్ద ఇంటికి అంతేనా పన్ను?...పర్మిషన్ లేకుండా కొట్టుకాపెట్టాడు- వాడికోసారి చురుకు తగిలితే గాని మన తడాఖా తెలీదు. అంతవరకు కానీ వాళ్ళు మనకుంటున్నాడు కాబోలు"

"ఆకాశరామన్న":

"గోముఖ వ్యాఘ్రాలు మీ వెంట తిరుగుతున్నాయి. మీకు ఎంతో నమ్మినవాడను అంటున్న వైస్‌చైర్మన్ మీమీద విశ్వాస రాహిత్య తీర్మానం ప్రవేశపెట్టడానికి కుట్రలు పన్నుతున్నాడు. ఆయనకి ఎక్కువగా చనువివ్వటం మంచిదికాదు. కౌన్సిలర్లలో కొంతమంది మీ మీద విరుద్ధప్రచారం చేస్తున్నారు. సమయం చూసి వాళ్ళనట్టు చేతిలో చిక్కించుకోటానికి మీరు ప్రయత్నించాలి..."

(సౌజన్యం: చైర్మన్‌గారి చెత్తబుట్ట).